AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in

7-6-2026 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2

పోకిరీలకు అడ్డాగా రైల్వేస్టేషన్

రామారెడ్డి-మద్దికుంట రోడ్డుకు మోక్షమెప్పుడో..!

మాజీ ఎమ్మెల్యేను పరామర్శించిన బీఆర్ఎస్ నాయకులు

అక్షరటుడే, ఇందూరు: మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా శనివారం కారు ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. అదృష్టవశాత్తు ఆయనకు ఎలాంటి ప్రమాదం జరగకపోగా కారు దెబ్బతిన్నది. ఈ సందర్భంగా బిగాలను బీఆర్ఎస్ నాయకులు హైదరాబాద్‌లో పరామర్శించారు. ఆయనను కలిసిన వారిలో నగర అధ్యక్షుడు సిర్ప రాజు, సీనియర్ నాయకులు దండు శేఖర్, చింతకాయల రాజు, అగ్గు సంతోష్, మాకు రవి, విఠల్ దాదా, సురుకుట్ల భాస్కర్, బాల్ నగర్ మధు, గుర్రాల సురేష్ ఉన్నారు.

తల్లిదండ్రులు విద్యార్థులపై ఒత్తిడి పెంచొద్దు: ఎమ్మెల్యే ధన్‌పాల్

అక్షరటుడే, ఇందూరు: చదువు విషయంలో తల్లిదండ్రులు విద్యార్థులపై ఒత్తిడి పెంచొద్దని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. శాలివాహన (కుమ్మర) ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో విద్యార్థులకు 'విద్య శిరోమణి' అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులందరికీ అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో ఉన్నతమైన లక్ష్యంతో ముందుకెళ్లాలని సూచించారు. జిల్లాకు దేశానికి మంచి పేరు తేవాలని చెప్పారు. విద్యను ఎవరు దొంగిలించే అవకాశం లేదని, విద్యతోనే ఉన్నత శిఖరాలకు ఎదగవచ్చన్నారు. ప్రధానంగా ప్రతి విద్యార్థి స్మార్ట్ ఫోన్లకు దూరంగా ఉండాలని, ఫోన్లతో మంచి ఎంతో చెడు కూడా అంతకు రెట్టింపు ఉంటుందన్నారు. కుమ్మర కులస్తులు రాజకీయంగా ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని, శాలివాహన కులస్తులకు ప్రత్యేక గుర్తింపునిస్తుందని స్పష్టం చేశారు. అనంతరం ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో కుమ్మర ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ భూపతి, ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్ రావు, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సాయికుమార్, జిల్లా గౌరవ అధ్యక్షుడు కనకం గంగాధర్, సంఘ సభ్యులు హన్మాండ్లు విసిగిరి గంగారం, ఆర్‌కే ప్రజాపతి, సిర్పూరు చిన్నయ్య, జిల్లా మాజీ అధ్యక్షుడు చందూర్ బాబు, 19వ డివిజన్ కార్పొరేటర్ నాగోల్ల లక్ష్మీ నారాయణ, బీజేపీ నాయకులు పవన్ ముందడ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో మున్నూరు కాపు కార్పొరేషన్ సేవలను విస్తరిస్తాం

అక్షరటుడే, ఇందూరు: రాష్ట్రంలో మున్నూరు కాపు కార్పొరేషన్ సేవలను మరింతగా విస్తరిస్తామని ఛైర్మన్ శ్రీరాం చక్రవర్తి పేర్కొన్నారు. తెలంగాణ మున్నూరు కాపు ప్రభుత్వ ఉద్యోగుల, విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ఉత్తమ ప్రతిభా పురస్కారాల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కొత్తగా ఏర్పాటు చేసిన మున్నూరు కాపు కార్పొరేషన్ విధివిధానాలను త్వరలోనే అందరికీ అందుబాటులోకి వచ్చేవిధంగా కృషి చేస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర రాజధానిలో పూర్తిస్థాయి కార్యాలయం ఏర్పడ్డ తర్వాత మున్నూరు కాపులు ఎవరైనా సమస్యల పరిష్కారానికి తమ వద్దకు వస్తే ఆ దిశలో పరిష్కారానికి తమవంతు సహకారం అందిస్తామన్నారు. గౌరవ అతిథిగా హాజరైన జిల్లా మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు ధర్మపురి సంజయ్ మాట్లాడుతూ కాపు కుటుంబాల అభ్యున్నతికి జిల్లా కమిటీ ఎల్లప్పుడూ కృషి చేస్తోందన్నారు. కాపు విద్యార్థులు అందరూ రాణించి వివిధ స్థాయిలో స్థిరపడాలన్నదే తమ అభిమతమన్నారు. కార్యక్రమంలో మున్నూరు కాపు ప్రతినిధులు డాక్టర్ అబ్బాపూర్ రవీందర్, ఇట్యాల వెంకట కిషన్, బుస్సా ఆంజనేయులు, డీసీసీ నగర అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ, పీసీసీ ప్రధాన కార్యదర్శి రాంభూపాల్, ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య, మాజీ జడ్పీటీసీ గోపి, సంఘం కోశాధికారి సురేష్, ఉపాధ్యక్షులు నరేష్, హరిచరణ్, సలహాదారులు అబ్బాయి లింబాద్రి, చిట్టి నారాయణరెడ్డి, శేఖర్, సిర్ప లింగం తదితరులు పాల్గొన్నారు.

జీపీలకు తప్పనున్న తిప్పలు

- ఇక గ్రామాల ఆదాయం నేరుగా వాడుకోవచ్చు!
- సర్పంచ్‌తో పాటు కార్యదర్శికి చెక్ పవర్
- చట్ట సవరణకు రంగం సిద్ధం చేసిన రాష్ట్ర ప్రభుత్వం

ప్రస్తుత నిబంధనల ప్రకారం, ఇంటి పన్నులు, నల్లా పన్నులు, గృహ నిర్మాణ అనుమతులు తదితరాల ద్వారా వచ్చే ఆదాయాన్ని గ్రామ పంచాయతీలు ట్రెజరీలో జమ చేయాల్సి ఉంది. నిధులు అవసరమైనప్పుడు ట్రెజరీ అనుమతి కోసం నెలల తరబడి వేచి చూడాల్సి రావడం, చిన్నపాటి పనులకు (ట్రాక్టర్ డీజిల్, వీధి దీపాలు, బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు) కూడా బిల్లుల కోసం ఆఫీసుల చుట్టూ తిరగాల్సి రావడం సర్పంచులకు పెద్ద తలనొప్పిగా మారింది. రాష్ట్ర వ్యాప్తంగా 12,760 గ్రామ పంచాయతీల నుంచి ఏటా సుమారు రూ. 140 కోట్ల ఆదాయం వస్తుండగా, అది నేరుగా వినియోగించుకునే వీలు లేక అభివృద్ధి కుంటుపడుతోందని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తూ వచ్చారు.

జిల్లాల వారీగా..

నిజామాబాద్ జిల్లాలో 27 మండలాల పరిధిలో 495 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. కామారెడ్డి జిల్లాలో 22 మండలాల పరిధిలో 535 గ్రామ పంచాయతీలు తమ పరిపాలనను కొనసాగిస్తున్నాయి. ఆయా జీపీల్లో ఇంటి పన్నులు, ఇంటి నిర్మాణ అనుమతులతో పాటు తైబజార్ వేలం ద్వారా గ్రామాలకు ఆదాయం వస్తోంది. అయి ఈ నిధులను నేరుగా వాడుకునే అవకాశం ప్రస్తుతం లేదు. చట్ట సవరణ చేస్తే ఏ గ్రామ పంచాయతీలో వచ్చిన ఆదాయాన్ని ఆ పంచాయతీలో నేరుగా వినియోగించుకునే అవకాశం ఉంటుంది.

కార్యదర్శికి చెక్‌పవర్

ప్రస్తుతం సర్పంచ్, ఉపసర్పంచ్‌కు జాయింట్ చెక్ పవర్ ఉంది. దీనిని తొలగించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఇకపై సర్పంచ్ గ్రామ కార్యదర్శికి జాయింట్ చెక్ పవర్ కల్పించనున్నట్లు సమాచారం. అయితే ఉప సర్పంచ్‌ల చెక్ పవర్‌రద్దు చేస్తే రాష్ట్ర వ్యాప్తంగా వారు ఆందోళనలు చేపట్టే అవకాశం ఉంది. దీంతో ఈ విషయంలో ప్రభుత్వం ఎలా ముందుకు వెళ్తుందో చూడాలి.

కఠిన నిబంధనలు

పంచాయతీల ఆదాయాన్ని నేరుగా వాడుకునే సౌకర్యం కల్పిస్తే.. ఆ నిధులను దుర్వినియోగం చేసే అవకాశం ఉంది. ఈ క్రమంలో ప్రభుత్వం కఠిన నిబంధనలను కూడా రూపొందిస్తోంది. ఖర్చు చేసిన ప్రతి రూపాయి వివరాలను రాష్ట్ర ప్రభుత్వ 'ఈపంచాయతీ' వెబ్ సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని పేర్కొంది. ఏటా ఆడిట్ నిర్వహించడం తప్పనిసరి. అక్రమాలు జరిగినట్లు తేలితే సర్పంచ్, కార్యదర్శిపై కఠిన చర్యలు ఉంటాయని ప్రభుత్వం హెచ్చరించింది.



గంగపుత్రులకు చిక్కిన భారీ చేప

అక్షరటుడే, మెండోరా : జిల్లాలో మృగశిర కార్తె సందడి నెలకొంది. ఈ సందర్భంగా పండుగ రోజు చేపలు తినడం ఆనవాయితీగా వస్తోంది. దీంతో చేపలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. మండలంలో మృగశిల కార్తె (మిరుగు) సందర్భంగా చేపలకు గిరాకీ పెరిగింది. ఈ క్రమంలో గోదావరి లో ఆదివారం గంగపుత్రులకు భారీ చేప చిక్కింది. సుమారు 14 కేజీల బొచ్చ చేప దొరికింది. దీంతో గంగపుత్రులు సంతోషం వ్యక్తం చేశారు. రూ. 300 కిలో చొప్పున ఈ చేపను విక్రయించారు. తాము నీటి వనరులమీదే బతుకుతున్నామని.. నీళ్లున్నప్పుడే తాము జీవనోపాధి పొందుతున్నామని.. వర్షాలు లేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయని మత్స్యశాఖ సొసైటీ అధ్యక్షుడు ఉమేష్, కార్యదర్శి లక్కంపల్లి రాజేందర్ పేర్కొన్నారు.

'నా భార్యపై నేను చేసిన ఆరోపణల్లో నిజం లేదు..'

అక్షరటుడే, కోటగిరి: ఎస్సైతో తన భార్యకు అక్రమ సంబంధం ఉందని చేసిన ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని ఇటీవల ఓ వీడియో విడుదల చేసిన హోంగార్డు పేర్కొన్నాడు. ఈ మేరకు ఆదివారం వీడియో విడుదల చేశాడు. బోధన్ డివిజన్‌లో పనిచేసే ఓ హోంగార్డు ఇటీవల ఓ వీడియో విడుదల చేశాడు. ఎస్సై తనను వేధిస్తున్నాడని.. తనపై కక్షతో దూర ప్రాంతాలకు డ్యూటీలు వేయించేవాడని అందులో పేర్కొన్నాడు. సదరు ఎస్సై తన ఇంట్లో గిన్నెలు తోమించేవాడని.. కాళ్లు సైతం ఒత్తించుకునేవాడని అందులో వాపోయాడు. తన భార్యకు తనకు గొడవ జరిగితే ఓ రోజు పోలీస్ స్టేషన్‌కు వచ్చిందని.. అప్పటినుంచి నాపై కక్షతో నా భార్యతో అక్రమ కేసులు పెట్టిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశాడు. ఆ క్రమంలో తనను దూరప్రాంతాలకు డ్యూటీలు వేసి ఆ సమయంలో తన భార్యను ఎస్సై ఇంటికి తీసుకెళ్లేవాడని పేర్కొన్నాడు. వారి మధ్య వివాహేతర సంబంధం కొనసాగుతోందని తీవ్రమైన ఆరోపణలు చేశాడు. అయితే తాజాగా విడుదల చేసిన వీడియోలో సదరు హోంగార్డు మాట్లాడుతూ.. తాను చేసిన ఆరోపణల్లో నిజం లేదని.. తన భార్యకు ఎస్సైతో ఎలాంటి సంబంధం లేదని వివరణ ఇచ్చాడు.

పార్టీ బలోపేతానికి బూత్ స్థాయి వ్యవస్థ కీలకం: షబ్బీర్ అలీ

అక్షరటుడే, కామారెడ్డి: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి బూత్ స్థాయి వ్యవస్థ కీలకమని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. కామారెడ్డి పట్టణంలోని ఆదివారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో నియోజకవర్గస్థాయి బూత్ లెవెల్ ఏజెంట్లు, పార్టీ కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ, సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. బీఎల్ఏలే పార్టీకి బలమైన పునాది అని, బూత్ లెవెల్ ఏజెంట్ పార్టీకి కళ్లు, చెవులూ వంటివాడని తెలిపారు. ఓటరు జాబితాలో సవరణలు చేయడానికి, కొత్తవారిని చేర్చడానికి బీఎల్ఏకు ఉన్న అధికారం సీఎంకు కూడా లేదని తెలిపారు. ప్రతి బీఎల్ఏ తన పరిధిలోని ఓటర్ల వివరాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఓటరు జాబితాలో తప్పులు, లోపాలు ఉంటే వెంటనే గుర్తించి సరిచేసే బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. బూత్‌స్థాయిలో పార్టీ కార్యకలాపాలు బలోపేతం కావాలంటే బీఎల్ఏలు నిరంతరం ప్రజలతో మమేకమై ఉండాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి బూత్ స్థాయి నిర్మాణమే ప్రధాన ఆయుధన్నారు. ఎన్నికల విజయానికి బూత్ స్థాయి నిర్వహణ అత్యంత కీలకమని జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ అన్నారు. ఓటరు జాబితాపై అప్రమత్తత అవసరమని, కొత్త ఓటర్ల నమోదు, మరణించిన వారి పేర్ల తొలగింపు, చిరునామా మార్పులపై బీఎల్ఏలు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

ఏజెంట్లు సైనికుల్లా పనిచేయాలి

అక్షరటుడే, డిచ్‌పల్లి: బూత్ స్థాయిలో ఏజెంట్లు సైనికుల్లా పని చేయాలని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పిలుపునిచ్చారు. రూరల్ నియోజవర్గ పరిధిలోని 293 మంది కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్లకు ఎస్ఐఆర్‌పై డిచ్‌పల్లి పరిధిలోని అమృత గార్డెన్‌లో ఆదివారం ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షకులు నాగరాజు గౌడ్, దుర్గేష్ గౌడ్, బోయ నగేష్‌లు ఏజెంట్లకు విస్తృత స్థాయిలో శిక్షణ కల్పించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో లోటుపాట్లు, విధివిధానాలు, ప్రక్రియ జరిగే తీరు, బూత్ లెవెల్ ఏజెంట్లకు గల విధులు, అధికారాలు, చట్టబద్ధ దరఖాస్తు తదితర అంశాలపై వివరించారు. వలస వెళ్లిన కుటుంబాలు.. కొత్తగా వచ్చిన కుటుంబాల వివరాలను సేకరించాలి. వలస వెళ్లిన కుటుంబాలు, కొత్తగా వచ్చిన కుటుంబాల వివరాలను సేకరించాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. బీజేపీ ప్రభుత్వం ఓట్లను కొల్లగొట్టి గెలవాలని యత్నాలు చేస్తుందని ఆరోపించారు. బూత్ లెవెల్ ఏజెంట్లు క్రియాశీలకంగా వ్యవహరించి, ఏ ఒక్క ఓటు కూడా పోకుండా ఉండేందుకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. బూత్ లెవెల్ ఏజెంట్లు సమర్థవంతంగా పని చేయాలని, ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గీత పారిశ్రామిక సహకార కార్పొరేషన్ ఛైర్మన్ శేఖర్ గౌడ్, ఏఎంసీ ఛైర్మన్ ముప్ప గంగారెడ్డి, భాస్కర్ రెడ్డి, పొలసాని శ్రీనివాస్, ఎర్రన్న, డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఆయా మండలాల అధ్యక్షులు అమృతాపూర్ గంగాధర్, బాల్‌రాజు, మోపాల్ సాయరెడ్డి, నవీన్ గౌడ్, చిన్నారెడ్డి, సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు వాసు, శ్రీనివాస్, జలంధర్, కాంగ్రెస్ పార్టీ ప్రధాన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తుమ్మ చెట్లపై.. కొంగల గూళ్లు..

తుమ్మచెట్లపై కొంగల గూళ్లు చూడముచ్చటగా కనిపిస్తున్నాయి కదూ.. డిచ్‌పల్లి నుంచి నిజామాబాద్ వైపు వెళ్లే ప్రధాన రోడ్డు పక్కన బర్దిపూర్ శివారు కళ్యాణ మండపం వద్ద ఈ దృశ్యం చూపరులను కనివిందు చేస్తోంది. ఈ ప్రాంతంలో తుమ్మ చెట్లపై వందల సంఖ్యలో కొంగలు గుళ్లు పెట్టుకుని జీవిస్తున్నాయి. ఈ దృశ్యాన్ని 'అక్షరటుడే' క్లిక్ మనిపించింది. – అక్షరటుడే, డిచ్‌పల్లి



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

అక్షరటుడే, కోటగిరి: 16 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత కోటగిరి మండల కేంద్రంలోని నలంద హైస్కూల్‌కు చెందిన 20092010 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఒక్కచోట కలిశారు. మండల కేంద్రంలో పాఠశాలలో వారు కలుసుకున్నారు. పాఠశాల రోజుల్లోని తీపి జ్ఞాపకాలు నెమరు వేసుకుంటూ ఆప్యాయంగా ఒకరినొకరు పలుకరించుకున్నారు. ఎంతోకాలంగా దూరంగా ఉన్న మిత్రులందరూ ఒకచోట చేరిన వేళ ఆ ప్రాంతమంతా సందడిగా మారింది. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని చిన్ననాటి అల్లరిని.. తరగతి గదిలో చేసిన చిలిపి పనులను నెమరువేసుకుంటూ ఆనందంలో మునిగిపోయారు. సుదీర్ఘ విరామం తర్వాత కలుసుకున్న ప్రతిఒక్కరూ తాము ప్రస్తుతం ఏయే రంగాల్లో స్థిరపడ్డామో వివరిస్తూ తమ అనుభవాలను పంచుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను స్మరించుకుంటూ, తాము ఈరోజు ఈ స్థితిలో ఉండటానికి వారి మార్గనిర్దేశనమే కారణమని కృతజ్ఞతా భావాన్ని చాటుకున్నారు.

రాష్ట్ర మున్నూరు కాపు కార్పొరేషన్ ఛైర్మన్‌కు ఘనసన్మానం

అక్షరటుడే, ఇందూరు: రాష్ట్ర మున్నూరు కాపు కార్పొరేషన్ ఛైర్మన్ బొమ్మ శ్రీరాం చక్రవరి ఆదివారం జిల్లాకు విచ్చేశారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌భవన్‌లో డీసీసీ కార్పొరేషన్ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ, నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీరాం చక్రవర్తి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాలు అన్ని అభివృద్ధి చెందాలని ప్రతి కులం అభివృద్ధి చెందాలని ఆలోచనతో ఆయా కులాలకు కార్పొరేషన్ల ఛైర్మన్లను నియమించారన్నారు. ఇది కేవలం కాంగ్రెస్ పార్టీ వల్లనే సాధ్యమైందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ నాయకత్వంలో రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి, రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ ఛైర్మన్ శేఖర్ గౌడ్, పంచాయతీ రాజ్ సంఘటన్ కమిషన్ మెంబర్ వేణుగోపాల్ యాదవ్, నుడా ఛైర్మన్ కేశవేణు, పీసీసీ ప్రధాన కార్యదర్శి రాంభూపాల్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు విపుల్ గౌడ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రత్నాకర్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ గౌడ్, మాజీ మేయర్ ఆకుల సుజాత, కార్పొరేటర్లు ప్రవీణ్ యాదవ్, నరేందర్, కోఆప్షన్ నెంబర్ నరేంద్ర సింగ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పోకిరీలకు అడ్డాగా రైల్వే స్టేషన్

నాలుగు జిల్లాల కూడలి కామారెడ్డి రైల్వేస్టేషన్. మూడు రాష్ట్రాలకు కేంద్ర బిందువు కూడా.. ఇతర రాష్ట్రాల నుంచి వ్యాపార రాకపోకలకు కామారెడ్డి రైల్వే మార్గం అనుకూలంగా ఉంటుంది. దాంతో ఇక్కడ వ్యాపార లావాదేవీలు జోరుగా సాగుతున్నాయి. అలాంటి రైల్వే స్టేషన్‌లో మహిళా ప్రయాణికులకు భద్రత కరువైందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్టేషన్‌లో పోలీసుల నిఘా వైఫల్యం కారణంగా పోకిరీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు.

– అక్షరటుడే, కామారెడ్డి

■ కామారెడ్డి స్టేషన్‌లో ప్లాట్‌ఫారాలపై వెకిలి చేష్టలు ■ ఒంటరి మహిళలతో అసభ్య ప్రవర్తన
■ ఇటీవల ఒకరికి దేహశుద్ధి చేసిన మహిళ ■ స్టేషన్‌లో నిఘా కరువైందని ప్రయాణికుల ఆరోపణలు

కామారెడ్డి రైల్వే స్టేషన్ పోకిరీలకు అడ్డాగా మారుతోంది. ప్లాట్ ఫారాలపై ప్రయాణికుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. ముఖ్యంగా ఒంటరిగా ప్రయాణించే మహిళలు, విద్యార్థినులు పోకిరీల వేధింపులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డ్రగ్స్, గంజాయి సేవించి వచ్చిపోయే ప్రయాణికులపై వేధింపులకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అదుపులేని ఆగడాలు

స్టేషన్‌లో సాయంత్రం 6 గంటలు దాటితే పరిస్థితి మరింత దారుణంగా ఉంటోందని ప్రయాణికులు చెబుతున్నారు. ప్లాట్ ఫారం నెం.1, 2 లతో పాటు వాహనాల పార్కింగ్ కోసం ఫ్లోరింగ్ చేసిన ప్రాంతంలో గుంపులుగా చేరే యువకులు రైలు కోసం ఎదురుచూసే మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలు చేస్తూ, ఈలలు వేస్తూ, కన్ను కొడుతూ వెకిలి చేష్టలకు పాల్పడుతున్నారు. ఫోన్ నంబర్లు అడగడం, వెంటపడి వేధించడం నిత్య కృత్యంగా మారిందని అక్కడి పరిస్థితిని చూసినివాళ్లు పేర్కొంటున్నారు.

తిరగబడిన మహిళ..

గత బుధవారం రైల్వే స్టేషన్ పార్కింగ్ ప్రాంతంలో కూర్చున్న ఓ మహిళ పట్ల ఓ వ్యక్తి అసభ్యంగా ప్రవర్తించాడు. దాంతో సహనం కోల్పోయిన సదరు మహిళ ఆ పోకిరికి అందరూ చూస్తుండగానే దేహశుద్ధి చేసి బుద్ధి చెప్పింది. ఇలాంటి ఘటనలు రైల్వే స్టేషన్‌లో తరచూ జరుగుతున్నాయని ప్రయాణికులు పేర్కొంటున్నారు.

స్టేషన్‌లో నిఘా కరువైందా..?

ప్రస్తుతం కామారెడ్డి రైల్వేస్టేషన్‌లో అమృత్ భారత్ 2.0 కింద అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. స్టేషన్‌లో ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు ఉన్నా పహారా నామమాత్రంగానే ఉందని ప్రయాణికులు వాపోతున్నారు. సీసీ కెమెరాలు ఉన్నా వాటిని పర్యవేక్షించే వారు లేరనే విమర్శలు వినిపిస్తున్నాయి. తరచూ ఘటనలు జరుగుతున్నాయని ప్రచారం సాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

ప్రయాణికుల డిమాండ్స్

రాత్రివేళల్లో ప్లాట్‌ఫారాలపై ఆర్పీఎఫ్, జీఆర్పీ గస్తీ పెంచాలని, మహిళా పోలీసులతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. స్టేషన్ ఆవరణలో సీసీ కెమెరాలను 24 గంటలు పర్యవేక్షించాలని, హెల్ప్‌లైన్ నంబర్లను ప్రముఖంగా ప్రదర్శించాలని కోరుతున్నారు. పోకిరీల అడ్డాగా మారిన రైల్వే స్టేషన్‌లో మహిళా ప్రయాణికులకు రక్షణ కల్పించడంలో రైల్వేశాఖ, పోలీసు అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కఠినచర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సిబ్బంది సరిపోవడం లేదు

పార్కింగ్ ఏరియాలో పోకిరీల బెడదపై రెండు రోజుల క్రితం ప్రత్యేక డ్రైవ్ చేపట్టాం. సమస్య పరిష్కరించాం. ప్లాట్‌ఫారాలపై చూడడానికి సరైన సిబ్బంది లేరు. జీఆర్పీ తరపున ఇద్దరు కానిస్టేబుళ్లు మాత్రమే ఉన్నారు. రైల్వే యాక్సిడెంట్స్, ఇతర ప్రొటెక్షన్ చూడడానికి ఇబ్బంది అవుతోంది. సీఆర్పీఎఫ్ ద్వారా ముగ్గురు మహిళా కానిస్టేబుళ్లు ఉన్నారు. అందులో ఒకరు ఏడాది పాప తల్లి, మరో ఇద్దరు గర్భిణులు. సిబ్బంది కొరత వల్ల ఇబ్బంది అవుతుంది. సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

– జీఆర్పీ, ఆర్పీఎఫ్ ఎస్సైలు

‘ఆర్టీఏ చలాన్’ లింక్‌ను క్లిక్‌చేసిన యువకుడు..

అకౌంట్ నుంచి నగదు మాయం..

అక్షరటుడే, బీర్కూర్: సైబర్ మోసగాళ్ల బారిన పడి ఓ యువకుడు డబ్బులు పోగొట్టుకున్నాడు. ఈ ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం.. నెల రోజుల క్రితం అతని వాట్సాప్‌కు ఆర్టీఏ ఈ-చలాన్ పేరుతో ఒక ఏపీకే ఫైల్ లింక్ వచ్చింది. అధికారిక సమాచారం అనుకుని మజ్జర్ అనే యువకుడు ఆ ఫైల్‌ను తన మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకున్నాడు. ఆ సమయంలో అతని బ్యాంకు ఖాతాలో డబ్బులు లేకపోవడంతో ఎలాంటి అనుమానం రాలేదు. అయితే ఇటీవల అతని ఖాతాలో డబ్బులు జమ అయిన తర్వాత విడతల వారీగా రూ.95,100 నగదు వివిధ లావాదేవీల రూపంలో ఖాతా నుంచి మాయమైనట్లు గుర్తించాడు. బ్యాంకు నుంచి డబ్బులు డెబిట్ అయినట్లు మొబైల్‌కు సందేశాలు రావడంతో వెంటనే తన ఖాతాను పరిశీలించగా సైబర్ మోసానికి గురైనట్లు తెలుసుకున్నాడు. దీంతో బాధితుడు బీర్కూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసిన ఏపీకే ఫైల్ ద్వారా సైబర్ నేరగాళ్లు వ్యక్తి గత, బ్యాంకింగ్ వివరాలను సేకరించి ఈ మోసానికి పాల్పడి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. వాట్సాప్, సోషల్ మీడియా ద్వారా వచ్చే తెలియని లింకులు, ఏపీకే ఫైళ్లు డౌన్‌లోడ్ చేయవద్దని, ప్రభుత్వ శాఖల పేరుతో వచ్చే సందేశాల నిజానిజాలను నిర్ధారించుకోవాలని సూచించారు.

ఆత్మహత్య కేసులో 10 మంది రిమాండ్

అక్షరటుడే, డిచ్‌పల్లి: ధర్పల్లి మండలం గోవింద పల్లి గ్రామానికి చెందిన కుంట గంగాధర్ ఆత్మహత్య చేసుకున్న ఘటనపై పోలీసులు విచారణ పూర్తి చేశారు. ఈ కేసులో దర్యాప్తు పూర్తి చేసిన అధికారులు ఇందుకు కారకులైన 10 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

పట్టణాల నుంచి పల్లెలకు సువిశాలమైన రహదారులు నిర్మించి రవాణా వ్యవస్థను గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు విస్తరించేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటోంది. అయితే అటవీశాఖ అనుమతుల జాప్యంతో అనేక చోట్ల పనులు నిలిచిపోతున్నాయి. ఈ కోవలోకే రామారెడ్డి-మద్దికుంట మధ్య రహదారి కూడా చేరింది.

- అక్షరటుడే, కామారెడ్డి

రామారెడ్డి – మద్దికుంట రోడ్డుకు మోక్షమెప్పుడో..?

■ కేవలం కిలోమీటర్ రోడ్డు కోసం ఏళ్ల తరబడి నిరీక్షణ
■ అటవీశాఖ అనుమతులు లేక తిప్పలు
■ ఇరుకైన మలుపు, చీకటితో రాత్రివేళ వాహనదారులకు నరకయాతన

రామారెడ్డి - మద్దికుంట రోడ్డుకు మోక్షం లభించడం లేదు. రామారెడ్డి నుంచి రెడ్డిపేట, మాచారెడ్డి చౌరస్తా వరకు గతంలో సింగిల్ రోడ్డుగా ఉన్న మార్గాన్ని వాహనాల రద్దీ, ప్రమాదాల దృష్ట్యా డబుల్ రోడ్డుగా మార్చారు. అయితే రామారెడ్డి, మద్దికుంట గ్రామాల శివారులను కలిపే కేవలం కిలోమీటర్ పొడవైన స్ట్రెచ్ మాత్రం ఏళ్లుగా విస్తరణకు నోచుకోవడం లేదు.

ప్రమాదాలకు నిలయం

రామారెడ్డి - మద్దికుంట ఈ కిలోమీటర్ మేర సింగిల్ రోడ్డు ఉండగా.. ప్రమాదకర మలుపులు ఉన్నాయి. దట్టమైన చెట్ల కారణంగా రాత్రి సమయంలో ఈ దారిలో వెళ్లాలంటే భయాందోళనకు గురవుతున్నారు. అసలు లైటింగ్ కూడా లేదు' అని వాహనదారులు వాపోతున్నారు. గతంలో ఈ ప్రాంతంలో దోపిడీలు జరిగిన ఘటనలు ఉన్నాయి. ప్రస్తుతం అక్కడక్కడా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వర్షాకాలంలో గుంతలుగా మారి ప్రమాదకరంగా ఉన్న ఈ రోడ్డుకు ఇటీవలే అధికారులు తాత్కాలికంగా ప్యాచ్ వర్క్ చేపట్టారు. ఈ కిలో మీటరు విస్తరణకు నిధులు మంజూరైనప్పటికీ, అటవీశాఖ పరిధిలోని భూమికి క్లియరెన్స్ రాకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. ఈ రహదారి విస్తరణ కోసం గతంలో ఆటో డ్రైవర్లు నిరసనకు సిద్ధమై వెనక్కి తగ్గారు. ఏళ్లుగా అనుమతుల కోసం ఎదురుచూస్తున్న ఈ రోడ్డును వెంటనే డబుల్ రోడ్డుగా మార్చి, ప్రయాణికుల కష్టాలను తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ సమస్యపై కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు గ్రామస్థులు సిద్ధమవుతున్నారు.

జర్నలిస్టు కాలనీ ప్రకృతివనంలో స్వచ్ఛభారత్

అక్షరటుడే, ఆర్మూర్: పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని.. ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని ఆర్మూర్ మహాత్మ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని జర్నలిస్టు కాలనీలోని ప్రకృతి వనంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిసరాలను శుభ్రంగా ఉంచుకొనేందుకు ప్రతిఒక్కరూ తమ వంతు సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ సభ్యులు బట్టు సుమన్, జంగిడి భోజన్న, జహీర్, గణేష్, శ్యాంసుందర్, డ్రైవింగ్ స్కూల్ వేణు, యాదగిరి, రాహుల్ రాజ్, సంతోష్, రఘువరణ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల రికవరీ..

అక్షరటుడే, ఆర్మూర్: పట్టణంలో పలువురు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను రికవరీ చేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం బాధితులకు వాటిని తిరిగి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్మూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆరుగురు తమ ఫోన్లు పోగొట్టుకున్నట్లుగా ఫిర్యాదు చేశారన్నారు. అందులో ఒక ఫోన్ రెండేళ్ల క్రితం పోయినది కూడా ఉందన్నారు. ఫిర్యాదు స్వీకరించిన అనంతరం సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వాటిని తిరిగి రివకరీ చేశామని పేర్కొన్నారు. సెల్ ఫోన్ పోగొట్టుకున్న వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు http://ceir.gov.in వెబ్ సైట్‌లో ఫోన్‌ను బ్లాక్ చేయించుకోవాలని ఎస్‌హెచ్‌వో సూచించారు. ఇలా చేస్తే దొంగ ఫోన్ వినియోగించలేరని, ట్రేస్ చేసి సులభంగా రికవరీ చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో బాధితులు విజయ్ కుమార్ రాజు, ముత్యమ్మ, దారం ప్రకాష్, బాలు, భరత్ రాజ్, సురేందర్, పోలీసులు పాల్గొన్నారు.